క్లుప్తంగా

సజ్జలను కలిసిన కోనా



సజ్జలతో కోనా దంపతులు

గుత్తి: తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో గుత్తికి చెందిన డోన్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కోనా మురళీధర్‌రెడ్డి, ఆయన సతీమణి శ్రీలత గురువారం ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు. అబ్జర్వర్లతో సమావేశం ముగిసిన తర్వాత కోనా దంపతులు సజ్జలను కలిసి రాజకీయ పరిస్థితులను వివరించారు.

న్యాయవాది రవి మృతికి నివాళి



న్యాయవాది రవి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: అనారోగ్యంతో మృతి చెందిన ప్రముఖ న్యాయవాది సిట రవి మృతదేహానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నివాళులర్పించారు. గురువారం సంజీవనగర్ మొదటి రోడ్డులోని ఆయన నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే పెద్దారెడ్డి న్యాయవాది కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం

శింగనమల: తరిమెలలో సచివాలయం, ఆర్బీకే, నిదనవాడలో గ్రామ సచివాలయం, ఆర్బీకే, సలకంచెర్వులో ఆర్బీకే, పెరవలిలో గ్రామ సచివాలయం, ఆర్బీకే, సీ.బండమీదపల్లిలో హెల్త్ క్లినిక్ భవనాలను శుక్రవారం ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ప్రారంభించనున్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి కోరారు.

కడదరగుట్టపల్లిలో ఘర్షణ

పెద్దవడుగూరు : కడదరగుట్టపల్లిలో స్థల వివాదమై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో వైఎస్సార్‌సీపీ నేత బైరవకొండారెడ్డి, రవికుమార్‌కు గాయాలయ్యాయి. వైస్ ఎంపీపీ హరినాథరెడ్డి రెండేళ్ల క్రితం వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో భూమి కొలతలు వేయించుకొని హద్దులు ఏర్పాటు చేసుకున్నాడు. ఈ భూమిలో తమ పొలాలకు వెళ్లడానికి స్థలం ఉందంటూ రవికుమార్ వర్గం వారు గురువారం గొడవకు దిగారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

పుట్లూరు ఎస్‌ఐగా దిలీప్‌కుమార్

పుట్లూరు: పుట్లూరు ఎస్‌ఐగా దిలీప్‌కుమార్‌ను నియమించినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు. అనంతపురం స్పెషల్ బ్రాంచ్‌లో ఉన్న ఈయనను ఇక్కడికి బదిలీ చేశారన్నారు.

విద్యార్థులకు మాస్టర్‌మైండ్స్ రేపు సన్మానం

తాడిపత్రి: తాడిపత్రి ప్రాంతంలోని వివిధ జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శనివారం సాయంత్రం టైలర్స్ కాలనీలోని జెడ్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థ ఆధ్వర్యంలో సన్మానించనున్నారు. ఈ మేరకు సంస్థ అడ్మిన్ అడ్వైజర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీసీ విభాగంలో 430, బైపీసీ విభాగంలో 400, ఎంఈసీ 470, సీఈసీ 450 మార్కులకు పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు వారి కళాశాల ఐడీ కార్డు, ఆధార్ కార్డు, మొదటి సంవత్సరంలో సాధించిన మార్కుల జాబితాతో రావాలని పేర్కొన్నారు. ఉచిత రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు 9248722218, 6303293445 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సమస్యలు తెలుసుకుంటున్న సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి: అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని యువనేత కేతిరెడ్డి సాయి ప్రతాప్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన బోడాయిపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ తిరుగుతూ సంక్షేమ లబ్ధిని తెలియజేయడంతోపాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోని ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. నవరత్న పథకాలతో ప్రజలందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. ఎంపీడీఓ రంగారావు, ఎంపీపీ సరస్వతి, మార్కెట్ యార్డు చైర్మన్ ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం

- ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి

పామిడి: ముఖ్యమంత్రి జగనన్న పాలనలో గడప గడపకూ సంక్షేమం అందుతోందని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం పీ కొండాపురంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డికి ఘన స్వాగతం లభించింది. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా డ్రైనేజీలు, సీసీరోడ్లు, కరెంటు తదితర సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెలే అధికారులను ఆదేశించారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగు

ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను నెరవేర్చిన సీఎం జగన్ పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ సర్కారు పాలన సాగిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, మండల ఇన్‌రార్జ్ సీబీ జానకిరామిరెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నక్కా సౌభాగ్య, ఓసీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మెత లక్ష్మి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్లు పెమ్మక చెన్నకేశవరెడ్డి, గౌరప్ప, పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్, సునీల్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, జోజోడే కుమార్, జంబన్న, పెద్దకుళ్లాయప్ప, రంగనాయకులు, బోయ రామచంద్ర, అనుంపల్లి సూరి, పార్వతీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



పీ కొండాపురంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి



పెద్దపప్పూరులో సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

నవరత్నాలతో అన్ని వర్గాలకు మేలు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: నవరత్నాల పథకాలతో అన్నివర్గాల ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. గురువారం పెద్దపప్పూరు సచివాలయం–2లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేపథకాలు అందుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమపథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈసందర్భంగా పలు సమస్యలను స్థానికులు విన్నవించగా స్పందించిన ఎమ్మెల్యే ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీటీసీ మేకల సరోజ, సర్పంచు ఓబులమ్మ, సీనియర్ నాయకులు ముచ్చుకోట అమర్‌నాథ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, స్థానిక నేతలు జనార్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి, షేక్‌పల్లి నాగిరెడ్డి, బండారు ప్రకాష్ పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: రాష్ట్రంలో ప్రతి గడప గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 13 వార్డులో రెండవ రోజు గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వార్డుల్లోని సమస్యలను ప్రజలతో అడిగి తెలుసుకున్నారు మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్ రంగనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని 6వ వార్డులో శుక్రవారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

పామిడి: వంకరాజుకాలువ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

తల్లిపాల ప్రాముఖ్యత తెలుసుకోవాలి

గుంతకల్లు రూరల్: తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్‌బాబు సూచించారు. గురువారం నాగసముద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గార్లదిన్నె: బిడ్డకు తల్లిపాలు ఎంతో సురక్షితమైనవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి పేర్కొన్నారు. గురువారం కొప్పలకొండలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె తల్లిపాల విశిష్టతను తెలియజేశారు. గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందించారు. సర్పంచు రామలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు కావేరమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల చరిత్రలో సరికొత్త అధ్యాయం

గుంతకల్లుటౌన్: అంగన్‌వాడీల చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. రక్తహీనత, శారీరక ఎదుగుదల లేక బాల్యం నుంచే పిల్లలు అనారోగ్యం బారిన పడకూడదని భావించిన రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకానికి శ్రీకారం చుట్టిందని ఆయన వెల్లడించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కిట్లు పంపిణీ చేశారు. సరుకులు అత్యంత నాణ్యంగా ఉండాలని ఆయన ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్, సీడీపీఓ ఢిల్లీశ్వరీ, సూపర్‌వైజర్లు పుష్పావతి, శ్రీదేవి పాల్గొన్నారు.



రేషన్ కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ బీవీ మాధవి పేర్కొన్నారు. నెలగొండలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సర్పంచ్ పాటిల్ భాగ్యమ్మ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షహీదా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.ఇదిలా ఉండగా నాగసముద్రంలో సర్పంచ్ నాగలక్ష్మి గర్భవతులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహులు పాల్గొన్నారు.

గుత్తి:పట్టణంలోని సాయిబాబా సెంటర్, మాల గేరి, బ్రాహ్మణ వీధి, జంగాల కాలనీ, చెట్నేపల్లి తదితర అంగన్వాడీ కేంద్రాల్లో సీడీపీఓ ఢిల్లీశ్వరి, సూపర్ వైజర్ నాగేశ్వరి, కౌన్సిలర్లు నజీర్, రూతమ్మ, నరేష్, కేవీ రమణ తదితరులు గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ(టీహెచ్ఆర్-టేక్ హోమ్ రేషన్) కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పామిడి: వైఎస్సార్ సంపూర్ణ పోషణతో మహిళకు మరింత ఆరోగ్యం పెంపొందుతుందని వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీ ఎం రాజశేఖర్, సర్పంచ్‌లు జీ వెంకట రమణమ్మ, రామాంజనేయులు, వెంకటేష్‌నాయక్, బాలనాగమ్మ, లక్ష్మీదేవి అన్నారు. గురువారం ఎద్దులపల్లి సెక్టార్‌కు సంబంధించి ఎద్దులపల్లితో పాటు పాళ్యం, పాళ్యంతండా, దిబ్బసానిపల్లి, వంకరాజుకాలువ గ్రామాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తోందని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. గురువారం చెన్నంపల్లి సమీపంలోని నీలారెడ్డిపల్లి వద్ద ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రత్యేక చొరవతో 2.30 కోట్లతో మంజూరైన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఆలూరు సాంబశివారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 9 గంటల నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించే దిశగా సబ్ స్టేషన్ నిర్మాణం చేపడుతోందన్నారు. ఈ సబ్ స్టేషన్ కింద చెన్నంపల్లి, నీలారెడ్డిపల్లి, వెంకటాపురం, పరిధిలో 1,350 సర్వీసులు, 2,150 గృహ విద్యుత్ సర్వీసులు వస్తాయన్నారు. గతంలో లో ఓల్టేజీ సమస్య ఉందని రైతులు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయించారన్నారు. ఎంపీపీ సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరి రమణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, కొర్రపాడు భాస్కర్‌రెడ్డి, రాధా మనోహర్‌రెడ్డి, గువ్వల రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ విజయ భాస్కర్, ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్ర, ఈఈ రమేష్, డీఈఈ రఘు, ఏఈ ప్రతాప్‌కుమార్, వైస్ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, నాయకులు ఆగ్రోస్ రామకృష్ణారెడ్డి, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, రామకృష్ణారెడ్డి, కొండమ్మ, నాగ, నాగరాజు, కాటమయ్య, గంగరాజు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటామని శింగమల నియోజకవర్గంలోని స్వచ్ఛ భారత్ మండల రీసోర్స్ కోఆర్డినేటర్లు పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న సురక్ష విజయవంతం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి





విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

తాడిపత్రి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు 11 రకాల సేవలను ఉచితంగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో ఓ సువర్ణ అధ్యాయంలా నిలిచిపోతుందన్నారు. జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు 98 శాతం సమస్యలు పరిష్కరించామన్నారు. మిగిలిన రెండు శాతం సమస్యలను త్వరలో పరిష్కరించి వంద శాతం మార్కును చేరుకుంటామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో 79,392 కుటుంబాలను వలంటీర్లు సర్వే చేసి, వారి అభ్యర్థనలను నమోదు చేశారన్నారు. వీటి పరిష్కారానికి 92 జగనన్న సురక్ష శిబిరాలను నిర్వహించామని, అందులో 32,435 మందికి పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అవసరమైనట్లు గుర్తించామని తెలిపారు. జగనన్న సురక్ష శిబిరాల ద్వారా 31,881 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందించామని గుర్తు చేశారు.

ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు...

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన నియోజకవర్గంలోని వలంటీర్లు, మున్సిపల్, రెవెన్యూ, గ్రామ, వార్డు, సచివాలయ సిబ్బందికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ వంద శాతం పథకాలను అందజేయాలన్న ప్రభుత్వ నిబద్ధతకు జగనన్న సురక్ష కార్యక్రమం నిదర్శనంగా నిలబడిందన్నారు. చరిత్రలో ఇలాంటి కార్యక్రమాన్ని తలపెట్టి, దానిని వంద శాతం అమలు చేసిన మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు.

'జగనన్న సురక్ష' దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం జూలై 1 నుంచి 31 వరకు జరిగిందన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వలంటీర్లు 84,483 ఇళ్లను సర్వే చేశారన్నారు. ఇందులో 26,062 మంది ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేశారన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా 90 జగనన్న సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసి 25,677 ధ్రువీకరణ పత్రాలు అందించామని తెలిపారు. గతంలో ఏ పని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాలు, టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యుల ఇళ్ల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. లంచం ఇవ్వనిదే పని జరిగేది కాదన్నారు. కాని జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. ఏపని కావాలన్న ఇంటికి తీసుకొచ్చే సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఏర్పాటు చేశారన్నారు. కుల, మత, పార్టీ భేదం లేకుండా పౌర సేవలందిస్తున్నారన్నారు. చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంను రెవెన్యూ డివిజన్ చేయాలని దరఖాస్తు చేసుకున్న, పట్టించుకోలేదని, కాని జగనన్న రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేశారన్నారు. చంద్రబాబు రాయలసీమలో ఒక్క ప్రాజెక్టు ప్రారంభించలేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హంద్రీ–నీవా ప్రాజెక్టును 80 శాతం పూర్తి చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న వచ్చాక నాలుగేళ్లలో ప్రాజెక్టులు, చెరువులు నీటితో నిండాయన్నారు. చంద్రబాబు పాలనలో ఎప్పుడు చూసినా నీరు లేక ప్రాజెక్టు, చెరువులు వెలవెలబోతున్నాయన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు శంకుస్థాపనలకే పరిమితమయ్యారని, ఆయన రాయలసీమ ద్రోహిగా నిలిచారన్నారు. సమావేశంలో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్ పార్వతమ్మ, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్వి నారాయణ, గాండ్ల కార్పొరేషన్ నరసయ్య, నాయకులు చెన్నకేశవులు, బయపరెడ్డి, రవికుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అప్రమత్తత అవసరం

గుంతకల్లు రూరల్: ఫ్లోరోసిస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు డాక్టర్ నవీన్‌కుమార్ బాబు, డాక్టర్ సాయి ప్రశాంత్ సూచించారు. జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం నాగసముద్రం పీహెచ్‌సీలో ఫ్లోరోసిస్ బాధితులకు వాకర్స్, మెడ, నడుం పట్టీ, వాకింగ్ స్టిక్స్ వంటి ఉపకరణాలను అందించారు. జిల్లా ఎన్సీడీ అధికారి డాక్టర్ నారాయణ స్వామి, జిల్లా ఫ్లోరోసిస్ అధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం ఎంపీపీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్ పర్సన్ సునీత ఫ్లోరోసిస్ బాధితులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు కొండమ్మ, మండల డాక్టర్ లక్ష్మిస్వాతి, సీహెచ్ఓ మోహన్‌రావు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేదల చెంతకే సంక్షేమ పథకాలు



సమస్యలు తెలుసుకుంటున్న హర్ష

యాడికి: పేదల చెంతకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కిందని వైఎస్సార్‌సీపీ యువ నేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం చింతలాయపల్లెలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా స్థానికులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎస్సీకాలనీలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త బాలన్న భార్య లక్ష్మీదేవి రెండు వారాల క్రితం గుండెపోటుతో మృతి చెందింది. బాలన్నను పరామర్శించిన హర్ష ఆర్థికసాయం అందించారు. వెంకటరాముడు, రమణమ్మ దంపతులకు ఆర్థికపరిస్థితులు తెలుసుకున్న హర్ష వారికి రూ.15 వేలు అందజేశారు. పెన్నా ఫ్యాక్టరీలో ఉద్యోగం కల్పించేలా ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ చెన్నప్ప, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్‌బాబు, భోగాతి బ్రహ్మానందరెడి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పేద విద్యార్థులకు ఆర్డీటీ సహకారం

గుంతకల్లుటౌన్: పేద విద్యార్థులకు ఎల్లప్పుడూ ఆర్డీటీ సహకారమందిస్తుందని సంస్థ డీఈటీ శ్రీకుమార్ చటోపాధ్యాయ, రీజినల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్డీటీ సంస్థ గతంలో నిర్మించిన తరగతి గదులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సాలాబాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల చదువుకు ఆర్డీటీ తోడ్పాటునందిస్తుందని చెప్పారు. అనంతరం ప్రిన్సిపాల్ అభ్యర్థన మేరకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆర్డీటీ(ఐఎఫ్ఐ) ఏడీ గంగప్ప ఎన్ఎస్ఎస్ పీఓలు శివప్రసాద్, నాగమణి పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించండి

పెద్దవడుగూరు : మండలంలోని బీఎల్ఓలు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ నాగభూషణ పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని బీఎల్ఓలు ఇంటింటి సర్వేలో వెనుకబడి ఉన్నారన్నారు. అందరూ త్వరగా సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఆర్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగల మహాధర్నా పోస్టర్ల విడుదల

గుత్తి: పట్టణంలోని అంబేద్కర్ భవన్ ఆవరణలో గురువారం ఈ నెల 14న గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయం వద్ద జరుగనున్న మాదిగల మహాధర్నా పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్ ప్రసాద్, సీనియర్ నాయకులు కాశీం, లాలెప్ప, రాము, వెంకటేష్, శంకర్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

లలిత కళాక్షేత్రం సాధన కమిటీ ఏర్పాటు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని కళాకారుల సౌకర్యార్థం లలిత కళాక్షేత్రం(కళావేదిక ఆడిటోరియం) నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించి, భవనాన్ని నిర్మించివ్వాలని లలిత కళాక్షేత్ర ఐక్యవేదిక అధ్యక్షుడు వెంకటాచలపతి, ప్రధాన కార్యదర్శి పుల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక ఇల్లూరు లక్ష్మీనారాయణ భవన్‌లో 12 కళాసంస్థలకు చెందిన కళాకారులు సమావేశమైయ్యారు. కళాక్షేత్రానికి స్థలం, భవన నిర్మాణ సాధన కోసం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లలిత కళాక్షేత్ర గౌరవాధ్యక్షుడిగా చక్రాల లక్ష్మీకాంతరాజారావు, అధ్యక్షుడిగా జీవీ.చలపతి, కార్యదర్శిగా పుల్లయ్య, ఉపాధ్యక్షులుగా ఈఓ రాముడు, త్యాగరాజు, సహాయ కార్యదర్శులుగా సుధాకర్, శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా భగవంతప్పను ఎన్నుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరీ సెక్షన్ ప్రైవేటీకరణ ఆపండి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆలూరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరీ సెక్షన్ ప్రవేటీకరణను ఆపాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని ట్రాన్స్‌కో(ఎస్‌పీఎం) సెక్షన్ ఉద్యోగులు విన్నవించారు. గురువారం ఎమ్మెల్యేను ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ట్రాన్స్‌కో ఉద్యోగులు మురళీ, భాస్కర్, శివారెడ్డి, నూరుద్దీన్ మాట్లాడుతూ 67 ఏళ్లుగా గుంతకల్లులో కొనసాగుతున్న ట్రాన్స్‌ఫార్మర్స్ రిపేరీ సెక్షన్‌లో 14 మంది ఉద్యోగులు పనిచేస్తున్నామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వైవీఆర్ జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రకు ఫోన్ చేసి ఎస్‌పీఎం సెక్షన్‌ను యథావిధిగా కొనసాగించాలని, ట్రాన్స్‌ఫార్మర్లు రిపేరీకి అవసరమైన సామగ్రిని సమకూర్చాలని కోరారు. ఉద్యోగులు ఖాదర్‌వలి,అస్లామ్, రామదాసు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

లింగ నిర్ధారణ నేరం

బుక్కరాయసముద్రం: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని మండల డాక్టర్ తెహరున్నీసా, హెల్త్ ఎడ్యుకేటర్ పర్వీన్ పేర్కొన్నారు. గురువారం కేజీబీవీలో విద్యార్థులకు ఆడ పిల్లల అభివృద్ధికి తోడ్పడుదాం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా విద్యార్థులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాలికల విద్య, సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ నాగవేణి, హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, పీహెచ్ఎన్ చెన్నమ్మ, రమీజా పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

గార్లదిన్నె: పి.కొత్తపల్లిలో గురువారం తెల్లవారు జామున అగ్నిప్రమాదంలో రైతు వెంకటేషుకు చెందిన వరి గడ్డివాము దగ్ధమైంది. దాదాపు రూ.1.7 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జలధికి తరలిన పీర్లు

పెద్దపప్పూరు: మొహర్రంలో భాగంగా చింతరపల్లి, చిక్కేపల్లి గ్రామాల్లో పీర్లస్వాములను గురువారం ఘనంగా ఊరేగించారు. కోర్కెలు నెరవేరిన భక్తులు పీర్లస్వాములకు చక్కెర,బెల్లంలతో పాటు వెండిగొడుగులను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పీర్లస్వాములను అగ్నిగుండ ప్రవేశం చేయించి జలధికి తరలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పర్యవేక్షించారు.

డ్రాపౌట్స్ లేకుండా చర్యలు తీసుకోండి

గుంతకల్లుటౌన్: ప్రాథమిక విద్య నుండి డిగ్రీ వరకు విద్యార్థుల డ్రాపౌట్స్ లేకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎంపీడీఓ వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో జీఈఆర్(గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో)పై విద్యాశాఖ అధికారులు, వార్డు విద్యాకార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు, వార్డు, గ్రామ విద్యా కార్యదర్శులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ సామగ్రి అపహరణ

పామిడి: పీ కొత్తపల్లి సమీపంలోని ఓ తోటలో ఉంచిన సెంట్రింగ్ సామగ్రి అపహరణకు గురైంది. వివరాలు.. సెంట్రింగ్ కార్మికుడు పీ వడ్డే శివకుమార్ వైఎస్సార్‌సీపీ నేత ఎంహెచ్ అనిల్‌కుమార్‌రెడ్డికి సంబంధించిన వారి సమాధి నిర్మాణ నిమిత్తమై సెంట్రింగ్ సామాన్లను తరలించారు. గుర్తు తెలియని వ్యక్తులు రూ.40 వేల విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బెంగళూరు వెళ్లి పింఛన్ అందజేత

గుత్తి: పట్టణానికి చెందిన ఇద్దరు మహిళా వలంటీర్లు బెంగళూరు వెళ్లి ఓ వృద్ధుడికి పింఛన్ సొమ్ము అందించారు. వివరాలు..గుత్తి చెర్లోపల్లి కాలనీకి చెందిన నారాయణ స్వామి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్లు హేమావతి, షేక్ సిమ్రాన్ గురువారం బెంగళూరు వెళ్లి వృద్ధుడికి పింఛన్ సొమ్ము అందించారు.